



నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోండి

- కలెక్టర్, సీపీతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో ఓ పాఠశాలలో విద్యార్థినుల మూత్రశాలల్లో రహస్య కెమెరాలు అమర్చిన యాకూబ్ పాషా అనే అటెండర్‌పై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏడాది కాలంగా విద్యార్థునులపై వేధింపులు జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యం వహించారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. కలెక్టర్ పమేలా స త్పతి, సీపీ గౌస్ ఆలంతో ఎమ్మెల్యే ఫోన్ లో మాట్లాడి ఆకృత్యానికి పాల్పడిన అటెండర్ యాకూబ్ పాషాను విధుల నుంచి తొలగించాలన్నారు. సంఘటనతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్య త్తులో ఇలాంటి సంఘటనలు జరగ కుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పరిహారం అందేనా..?

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోతున్న గంగాధర మండల రైతులు

7

మద్యం దుకాణాలకు లైసెన్స్‌దారుల ఖరారు

- 94 వైన్‌షాపులకు రూ. 55.45 కోట్ల లైసెన్సు ఫీజు
- దుకాణాలు దక్కించుకున్న 23 మంది మహిళలు
- సంబరాల్లో షాపులు పొందిన వ్యాపారులు





డ్రా తీసి టోకెన్‌ను చూపుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

లాటరీ ప్రక్రియలో పాల్గొన్న మహిళలు, వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలోని 94 మద్యం దుకాణాలకు లైసెన్స్‌దారులను ఎంపిక చేసే లాటరీ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. షాపులు దక్కినవారు సంబరాల్లో మునిగితేలగా... డ్రాలో దుకాణం రాని వారు మూడు లక్షల రూపాయల దరఖాస్తు రుసుం కోల్పోయి నిరాశతో వెనుదిరిగారు. లక్కు ఎవరిదో తేలింది. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారితోపాటు కొత్తగా మద్యం వ్యాపారంలోకి అడిగిడిన వారు మద్యం దుకాణాల కోసం పోటీ పడడంతో దరఖాస్తులు భారీగా అందాయి. జిల్లాలోని 94 వైన్ షాపుల లైసెన్సుల కోసం టెండర్లు నిర్వహించగా 2,730 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో దరఖాస్తుకు మూడు లక్షల చొప్పున ఫీజు చెల్లించడంతో దరఖాస్తుల ద్వారా 81 కోట్ల 90 లక్షల రూపాయల ఆదాయం సర్కారుకు సమకూరింది. 2023-25 సంవత్సరంలో నిర్వహించిన టెండర్లలో 94 వైన్‌షాపులకు 4,040 దరఖాస్తులు అందాయి. అప్పుడు దరఖాస్తుఫీజు 2 లక్షలుండగా ప్రస్తుతం దరఖాస్తుఫీజును 3 లక్షలకు పెంచడంతో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. గతంలోకంటే దరఖాస్తులు తక్కువగా వచ్చినప్పటికీ ఆదాయం ఒక కోటి 10 లక్షల రూపాయల ఆదాయం అధికంగా వచ్చింది. దరఖాస్తు ఫీజును రెండు లక్షల నుంచి మూడు లక్షలకు పెంచడంతో జిల్లా వ్యాప్తంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒక్కో గ్రూపు తరఫున 50 నుంచి 150 వరకు దరఖాస్తులు చేశారు.

- కలెక్టరేట్‌లో డ్రా

సోమవారం మద్యం షాపులను ఖరారు చేయడానికి కలెక్టరేట్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియను చేపట్టారు. కలెక్టర్ పమేలా సత్పతి ఉదయం 11 గంటలకు లాటరీ తీయడం ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యాహ్నం 1:30 గంటలకు ముగిసింది. గెజిట్ నంబర్ 1కు వచ్చిన దరఖాస్తుదారుల పేర్లను పిలిచి అనంతరం దరఖాస్తులకు కేటాయించిన నంబర్లను ఒక స్టీల్ డబ్బాలో వేసి లాటరీ విధానంలో అందులో నుంచి కలెక్టర్ ఒక నంబర్‌ను బయటకు తీసి ఆ షాపు లైసెన్స్‌దారుడిని ఖరారు చేశారు. ఇదే విధంగా జిల్లాలోని 94 వైన్‌షాపులకు లైసెన్స్‌దారులను కలెక్టర్ స్వయంగా డ్రా తీసి ఖరారు చేశారు. 94 మద్యం దుకా ణాల్లో ఎస్సీలకు 9, గౌడ కులస్థులకు 17 షాపు లను కేటాయించారు. మిగతా 68 దుకాణాలు జనరల్ కేటగిరీకి రిజర్వు చేశారు. ఈ లాటరీ ప్రక్రియ అంతటిని ఎల్‌ఈడీ స్క్రీన్లపై అందరు చూసే విధంగా ప్రదర్శిం చారు. లాటరీ ప్రక్రియ పూర్తయ్యే వరకు కలెక్టర్ పమేలా సత్పతి ఆడిటోరి యంలోనే ఉన్నారు. 94 వైన్‌షాపులకు లైసెన్స్‌ల కోసం 2,730 దరఖాస్తులు రాగా లాటరీ ద్వారా మొత్తం దుకాణాలకు లైసెన్స్‌దారులను ఎంపిక చేశారు. మొత్తం 94

(మిగతా 8వ పేజీలో)

మొదటి వైన్ షాపు లైసెన్స్ మహిళకు..

జిల్లాలో 94 వైన్‌షాపలుండగా కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నుంచి గెజిట్ నెంబర్-1 షాపు ప్రారంభమైంది. కరీంనగర్ విద్యానగర్, వావిలాలపల్లి, జ్యోతినగర్‌ల క్లస్టర్‌కు కలెక్టర్ లాటరీ ద్వారా టోకెన్(లోకెన్ నంబరు16)ను తీయగా పెద్దపల్లి జిల్లా కాట్నపల్లికి చెందిన పొన్నాల సంతోషకు అదృష్టం వరించింది. మొదటిషాపు మహిలకు రావడం గమనార్హం.

లక్కంటే వెంకటేష్‌దే....

కరీంనగర్‌లోని రాంనగర్ వైన్‌షాపు గెజిట్ నంబరు 19 (రిజర్వు గౌడ్)కి 37 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ షాపు లైసెన్స్ కోసం కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన పల్లె వెంకటేశం అనే వ్యక్తి ఒకటే దరఖాస్తు చేయగా ఆయనకే ఈ షాపు దక్కింది. లాటరీ ప్రక్రియలో 37 మంది టోకెన్లను డబ్బాలోవేసి కలెక్టర్ ఒక టోకెన్‌ను తీయగా వెంకటేష్ నంబర్(టోకెన్ 27) వచ్చింది. 50, 100 సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్న గ్రూపులు, వ్యక్తులకు దక్కని షాపులు సింగిల్ టెండర్ వేసిన తనకు రావడంపై వెంకటేశం ఆనందం వ్యక్తం చేశాడు. వెంకటేశం ప్రస్తుతం విద్యానగర్‌లో వైన్‌షాపును నిర్వహిస్తున్నాడు.

పారదర్శకంగా మద్యం దుకాణాల డ్రా

- కలెక్టర్ పమేలా సత్పతి

మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ పమేలా సత్పతి ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ డ్రా ప్రక్రియను కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించామన్నారు. ఈ దుకాణాలు డిసెంబర్ 1 నుంచి నూతన లైసెన్సులతో ప్రారంభమవుతాయన్నారు.

సీసీఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీ గౌస్‌ఆలం

సీసీఎస్ నూతన కార్యాలయం ప్రారంభం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్‌లో నూతనంగా ఏర్పా టు చేసిన సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను (సీసీఎస్) పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం సోమవారం ప్రారంభించారు. ఇప్పటి వర కు సీసీఎస్ కరీంనగర్ టూ టౌన్ పోలీసు స్టేషన్ భవనం పైన ఉండేది. కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయ కాంపౌండ్‌లో నిర్మించిన నూతన భవనంలోకి సీసీఎస్ ను తరలించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్‌ఆలం పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతన కార్యాల యాన్ని లాంఛ నంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. నూతన భవనం ద్వారా సీసీఎస్ పోలీసు స్టేషన్ సిబ్బందికి మెరుగైన వాతావరణం లభి స్తుందని, అధికారులు, సిబ్బంది మరింత సమర్థ వంతంగా సేవలు అందిస్తారన్నా రు. సీసీఎస్ పోలీసుస్టేషన్ సేవలు పో లీస్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని, ముఖ్యంగా నేరస్థులను పట్టుకోవ డంలో వారి సహకారం ఎంతో ముఖ్య మని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిష నల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజ యకుమార్, యాదగిరిస్వామి, వేణు గోపాల్, సీసీఎస్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

యువతలో స్ఫూర్తి నింపేందుకు సర్దార్ @ 150 యూనిటీ మార్చ్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



యునిటీ మార్చ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి సంజయ్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యువతలో స్ఫూర్తి నింపేందుకు సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ నిర్వహిస్తున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా మేరా యువ భారత్ (మై భారత్) పోర్టల్ నేతృత్వంలో యూనిటీ మార్చ్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మేరా యువ భారత్ కరీంనగర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. సర్దార్ వల్లభాయి పటేల్ ఆదర్శాల సాధనకు జాతీయ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల్లో యువత ముందు వరుసలో నిలవాలని విజ్ఞప్తి చేశారు. సర్దార్ వల్లభాయి పటేల్ దార్శనికతతో, దృఢ సంకల్పంతోనే భారత్‌లో హైదరాబాద్ విలీనమైంద న్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ అందించిన స్ఫూర్తితో జాతీయ సమగ్రత, ఏకత, యువజన భాగస్వామ్యం వంటి ఆదర్శభావనలను ఒక ఉత్సవంగా జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు. మేరా యువ భారత్ డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ ఎం వెంకట రాంబాబు మాట్లాడుతూ సర్దార్ @ 150 యూనిటీ మార్చ్‌లో భాగంగా యువతను భాగస్వాములను చేస్తూ రాబోయే రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు, ప్రతిజ్ఞలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ సహకారంతో వికసిత్ భారత్ పాదయాత్రలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ అంశాలపై డిజిటల్ మాధ్యమాల ద్వారా ఈ నెల 6న ప్రచారం ప్రారంభించామన్నారు. దీనిలో భాగంగా సామాజిక మాధ్యమాల్లో రీల్స్, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మొదటి విడతలో ఈ నెల 31 నుంచి నవంబరు 25 వరకు జిల్లా స్థాయి పాదయాత్రలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి బి రవీందర్, పాదయాత్ర జిల్లా కన్వీనర్ జి శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ డాక్టర్ తిరుపతి, డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలు పెంచాలి

- ఎంపీ లాడ్స్‌తో పిల్లలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



గర్భిణికి పండ్లు, స్వీట్లను అందజేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోషణ్ అభియాన్ కార్యక్రమం అమల్లో కరీంనగర్ అంగన్‌వాడీ సిబ్బంది పనితీరు బాగుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశంసించారు. అనేక క్లిష్ట పరిస్థితుల్లో వారందిస్తున్న సేవలను గుర్తించి వేతనాలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కరీంనగర్ కళాభారతిలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఒకప్పుడు చిన్న పిల్లలు పోషకాహార లోపంతో ఇబ్బందులు పడ్డారన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు పౌష్టికాహారం అందించేం దుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోం దన్నారు. ఆయు ష్మాన్ భారత్ హెల్త్ కార్డు పేరుతో ఉచితంగా ఐదు లక్షల రూపాయల వరకు వైద్యం అందిస్తోందన్నారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించారు. చిన్నారులకు పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు మహి ళలు చేతి గ్లౌజ్ తరహాలో తయారు చేసిన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. వీటి ని ప్రతి ఒక్క పిల్లవాడికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఎంపీ నిధుల నుంచి వాటిని కొనుగోలు చేయించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సదర్ ఉత్సవం..



సదర్ ఉత్సవంలో దున్నపోతుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్ గ్రామంలో నిర్వహించిన సదర్ ఉత్సవాన్ని సోమవారం రాత్రి ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దున్నపోతుల విన్యాసాలను తిలకించారు. ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, కన్నబోయిన ఓదెలు యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యం యాదవ్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొమురయ్యయాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పంది శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

30న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయండి

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కళాశాలల యాజమాన్యాలు ఎస్ఎఫ్ఐ నిర్వహించే బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు వినయ్ సాగర్, ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, రాకేష్, నాయకులు నరేష్, సన్ని, రఘు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఏవీ చర్యలు

- సీడీఎంఏ ఆదేశాలు బేఖాతరు
- 80 రోజులు దాటినా అడుగు ముందుకు పడని విచారణ

కరీంనగర్ టౌన్, అక్టో బరు 27 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తు న్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. అక్రమ నిర్మాణా లు, రోడ్ల కబ్జాలు, ఎల్ఆర్ ఎస్, ఇంటి నిర్మాణ అను మతుల విషయంలో అధికారులు చుట్టూ తిరిగినా కాల యాపన చేస్తూ ముప్పు తిప్పలు పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమ వారం ప్రజావాణిలో కలెక్ట ర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు, వరంగల్ ఆర్‌జే డీకి, సీడీఎంఏకు, చివరకు కోర్టుకు వెళ్లి ఫిర్యాదు చేసినా అధికారులు వారికి నచ్చితే తప్ప స్పందించడం లేదని విమర్శిస్తున్నారు.

- ఇటీవల రాఘవేంద్రనగర్‌లో ఓ ఇంటి యజమాని నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. కోర్టు ఆర్డర్ ఇచ్చిందంటూ అక్రమ నిర్మాణాలను తొలగించడంతో ఆ ఇంటి యజమాని సూసైడ్ నోట్ రాసి స్థానికుల ఫిర్యాదు, టౌన్‌ప్లానింగ్ అధికారుల దౌర్జన్యంతోనే చనిపోతున్నానంటూ సూసైడ్‌నోట్‌లో రాసి చనిపోవడం కలకలం రేపింది. కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకున్నామే తప్ప తమ దౌర్జన్యమేమి లేదంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకటన జారీచేశారు.

- సప్తగిరికాలనీకి చెందిన జావిద్‌హుస్సేన్ అక్రమ నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెండేళ్ళ క్రితం ఆనాటి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసి చివరకు అక్రమ నిర్మాణం డిస్మెంటల్ చేయాలని ఆర్డర్ జారీ చేశారు. ఆ ఉత్తర్వులను టౌన్‌ప్లానింగ్ అధికారులు అమలు చేయక పోవడంతో చివరకు ఆర్డీడీకి అప్పీల్ చేసుకున్నారు. ఆయన అప్పీల్‌ను కొట్టివేశారు. దీంతో సీడీఎంఏకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలనుకూడా అమలు చేయలేదు. కోర్టును ఆశ్రయించగా కోర్టులో వాదనలు కొనసాగుతున్నారు. జావిద్ హుస్సేన్ తెలిపారు. 2025 జూలై 24న విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేయగా 80 రోజులు అవుతున్నా విచారణ చేపట్టడం లేదని వాపోయారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు ఎందుకు విచారణ చేపట్టడం లేదని, టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరును ఆయన తప్పుబట్టారు. కోర్టు ఆదేశించినా, ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేసే విధంగా కమిషనర్ స్పందించాలని కోరుతున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


దేశ్పాల్ శోభ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ మండలం, ఉప్పర పల్లి గ్రామానికి చెందిన దేశ్పాల్ శోభ నాలుగు రోజులక్రితం తన చిన్నకూతురుకు వద్దకు వచ్చి అదృశ్యం అయింది. ఈ మేరకు కేసు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డెలివరీ అయిన తన చిన్న కూతురు చూడడానికి శోభ వచ్చింది. సోమవారం ఉదయం ఏరియా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పట్టణంతోపాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శోభ పెద్ద కూతురు గీత ఇచ్చిన ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ కరుణాకర్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712670773, 8712574726 నంబర్లకు సమా చారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నాగుల మల్యాల శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో నాగులమల్యాలకు చెందిన చేకూరి సతీష్(30) మృతిచెందాడు. కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. నాగుల మల్యాలకు చెందిన సతీష్ గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని బావుపేటనుంచి బైక్‌పై ఇంటికివస్తున్న క్రమంలో నాగుల మల్యాల శివారులోని మూలమలుపు వద్ద బైక్అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సతీష్ మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యూరీ గదిలో భద్రపరిచారు.

కార్మికుల పిల్లలకు కేంద్రం చేయూత

- ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్
- పోస్టుమెట్రిక్ దరఖాస్తులకు 31 వరకు గడువు



చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పిల్లల విద్య కోసం కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోంది. 1వ తరగతి నుంచి బీటెక్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను. వెయ్యి రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు అందజేస్తోంది. పోస్టుమెట్రిక్‌కు సంబంధించిన ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఏఎంఎస్, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తును చేసుకోవాలి.

● బీడి కార్మికులు, ఐవోఎంసీ, ఎల్ఎస్‌డీఎం కార్మిక కుటుంబాలకు చేయూత..

బీడి కార్మికుల పిల్లలతోపాటు ఐరన్ ఓర్, మాంగనీస్ ఓర్, లైంస్టోన్ మైన్స్, డోలోమైట్, మైకా మైన్స్, సినీ కార్మికుల కుటుంబాల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. 1వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులకు వెయ్యి నుంచి 25 వేల రూపాయల వరకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో నేరుగా విద్యార్థుల ఖాతాలకే నగదును బదిలీ చేస్తారు.

● దరఖాస్తు.. అర్హతలు..

విద్యార్థులు ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో రెగ్యులర్ పద్ధతిలో పాసై ఉండాలి. సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులు అనర్హులు. దూర విద్యను అభ్యసించే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. ఈ నెల 31 లోగా దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులకు 3 వేల రూపాయలు, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు 6 వేలు, బీటెక్, ఎంబీఏఎస్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ఏడాదికి 25 వేల రూపాయల ఉపకార వేతనం అందుతుంది. ప్రభుత్వ అనుమతి ఉన్న కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు. బీడీ కార్మికులు, మైన్ కార్మికుల వేతనం 10 వేలలోపు ఉండాలి. సినీ కార్మికుల వేతనం నెలకు ఎనిమిది వేల రూపాయలు ఉండాలి. కార్మికుల గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత మెమో, తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.

నా కొడుకు మృతికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలి

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు ఆత్మహత్య చేసుకోవటానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీకి చెందిన శీలం రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవటానికి కారణమైన వారిపై మంథని పోలీసులకు ఫిర్యాదుచేసి నెలలుగడిచినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. శ్రీపాదకాలనీలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2024 డిసెంబర్ 6న జరిగిన గొడవ నేపథ్యంలో తన కొడుకు పై ఫిర్యాదు మేరకు మంథని ఎస్ఐ రమేష్ కొట్టడంతో అవమానభారంతో డిసెంబర్ 8న ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. తాము గమనించి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా 2025 సెప్టెంబరు 19న రాజ్‌కుమార్ మృతి చెందినట్లు తెలిపారు. రాజ్‌కుమార్ మృతికి పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుండా పాపారావు, మూల పురుషోత్తంరెడ్డిల ఒత్తిడేకారణమని ఆరోపించారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకొని న్యాయంచేయాలని ఆమెపోలీసు ఉన్నతాధికారులను కోరారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి తండ్రీ, కొడుకుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటుపాఠశాల నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి ఐదేళ్ల వయసు ఉన్న విద్యార్థి ప్రణయ్, తండ్రి రాజు సోమవారం పక్కనే ఉన్న మురుగు నీటి కాల్వలో పడిపోయారు. విద్యార్థి, తండ్రికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామంలోని రాజు కొడుకు ప్రణయ్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. కొడుకు తీసుకుని బైక్‌పై వెళ్తున్న రాజు ఎదురుగా బస్సు రావడంతో రోడ్డు పక్కన ఆగాడు. కాలు కింద పెట్టడడం వల్ల అదుపు తప్పి మురుగు నీటి కాల్వలో పడిపోయారు. గమనించిన వాహనదారులు కాల్వలోని తండ్రీకొడుకులను బయటకు తీయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వెండి నాణేలపై అధికారుల విచారణ


వెండి నాణేలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జూలపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో వెండి నాణెములు లభ్యమైనట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. చీమలపేట గ్రామానికి చెందిన తొంటి రాజు పాతఇంటిని బ్లేడ్ ట్రాక్టర్‌తో సహాయంతో చదును చేస్తుండగా 10వెండి నాణెములు లభ్యమైనట్లు అధికారులు పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నాణెములు 1925సంవత్సరం నిజాంప్రభువు పాలనలో ముద్రించినట్లు ఆధారాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, గిర్దవర్ భవానిప్రసాద్, పోలీసులు అజీమ్ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఎస్‌యూ స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో వచ్చేనెల7న నిర్వహించనున్న 2వ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆహ్వాన పత్రిక అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిశారు. స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని పనులూ దాదాపు పూర్తవుతున్నాయని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో హత్యచేసిన నిందితుడు మహేష్‌కు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. జగిత్యాల పట్టణం హనుమాన్‌వాడకు చెందిన తోటశేఖర్, బీట్‌బజార్ చెందిన సామాండ్ల మహేష్‌కు పాతగొడవలు ఉండేవి. ఈ నేపథ్యంలో 2023అక్టోబరు 16న శేఖర్‌కు అతిగా మద్యం తాగించి మహేష్ కత్తితో పొడిచి హత్యచేశాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు జగిత్యాలటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పిపి మల్లికార్జున్, అప్పటి ఇన్విస్టిగేషన్ ఇన్స్‌పెక్టర్ కిషోర్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసి దూషించిన కేసులో నిందితుడైన ప్రశాంత్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4,200 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్ లావణ్య తీర్పు వెలువరించారు. జగిత్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన మారంపెల్లి లక్ష్మణ్‌ను 2022 నవంబర్ 13న ప్రశాంత్ అనేవ్యక్తి మద్యం మత్తులో దూషించి దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జగిత్యాలరూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఏపీపీ, కోర్టుడ్యూటీ అధికారులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన ఏపీపీ రాజేష్, ఎస్సై అనిల్, సీడీవో నాగరాజు, సీఎంఎస్ ఎస్సైని ఎస్పీ అభినందించారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

● బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు

జగిత్యాల టౌన్, అక్టోబర్, 27 (ఆంధ్రజ్యోతి): మైనర్‌బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠినకారాగార జైలుశిక్ష, రూ.10 వేల జరిమానాతోపాటు బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పుచెప్పారు. 2023లో కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌పరిధిలో కట్కూరిఅశోక్ అనేనిందితుడు బాలికను అత్యాచారంచేసిన ఘటనలో పోక్సో చట్టం కిందకేసు నమోదుచేశారు. అప్పటి ఇన్స్పెక్టర్లు కృష్ణకుమార్, కిషోర్ రమణమూర్తి కేసు విచారణచేసి ఫాస్ట్ ట్రాక్‌స్పెషల్‌కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పీపీ, కోర్టుడ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా సోమవారం ప్రధానన్యాయమూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడడంలో కృషిచేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్విస్టిగేషన్ ఆఫీసర్ ఇన్స్‌పెక్టర్‌లు కృష్ణకుమార్, కిషోర్, రమణమూర్తి, సీఎంఎస్ ఎస్సైశ్రీకాంత్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆదిత్య(ఫైల్)

బోయినపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలకేంద్రంలో ఇంటర్ విద్యార్థి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బోయిన్‌పల్లికి చెందిన పిట్టల మల్లేశం కుమారుడు ఆదిత్య(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి పండుగకు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన ఆదిత్య సెలవులు ముగిశాక హాస్ట ల్‌కు వెళ్లలేదు. కుటుంబసభ్యులు హాస్టల్‌కు వెళ్లాలని ప్రాధేయపడ్డారు. ఆదిత్య హాస్టల్‌కి వెళ్లడం ఇష్టం లేక ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సోమవారం ఉదయం గ్రామంలోని ఓ రైతు పొలం వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. తండ్రి మల్లేశం ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మనోజ్(ఫైల్)

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ రోడ్డుకు చెందిన దామ మనోజ్(28) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. దామమనోజ్ అనేయువకుడు తన స్నేహితుడైన పుప్పాల మహేష్‌తో ద్విచక్ర వాహనంపై ఐబీ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తుండగా ఆవును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అటుగావస్తున్న లారీ దామ మనోజ్‌పై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మహేష్ స్వల్పగాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. కాగా మనోజ్‌కు సోమవారం వివాహ విషయమై అమ్మాయి తరపు వారితో మాట్లాడాల్సి ఉండగా అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మనోజ్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీవిద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన వేములవాడ అక్షయ్‌సాయి(18) అనేయువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తనస్నేహితుడిని తీసుకరావడానికి హుజూరాబాద్ నుంచి రంగాపూర్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జమ్మికుంట రోడ్‌లోని గెలాక్సీ సూపర్‌మార్కెట్ వద్ద మున్సిపల్ ట్రాక్టర్ డివైడర్లలో మట్టిని పోయడానికి ఆపాడు. ఈ క్రమంలో అక్షయ్‌సాయి ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కాలువలో పడి ఒకరి మృతి

కోనరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట శివారులోని కల్వర్టు కింద ఉన్న కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నబోనాల గ్రామానికి చెందిన గోస్కుల పరశురాములు (42) ఆదివారం కోనరావుపేట మండల కేంద్రంలోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మల్కపేట గ్రామ శివారులో పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికాడు. పోలీసులు అతని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని బస్సు ఎక్కించి పంపించారు. మల్కపేట శివారులో బస్సు దిగి కింద పడుతూ వెళ్లాడు. మల్కపేటలో ఉన్న తల్లి కనకవ్వ కుటుంబ సభ్యులు రాజు ఎంతకు ఇంటికి తిరిగిరాకపోవడంతో సోమవారం ఉదయం వెతుకు తుండగా మల్కపేట శివారులోని బ్రిడ్జికింద ఉన్న కాలువలో పడి మృతిచెందినట్లు గుర్తించారు. ఈవిషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డికి తల్లికనకవ్వ మల్కపేటశివారులోని బ్రిడ్జికాలువలోపడి మృతి చెందాడా?, ఇంకేమన్నా కారణాలు ఉన్నాయా అనే విషయంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాంచంద్రాపూర్‌లో చోరీ

● నాలుగు తులాల బంగారం అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర చారి

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామంలో పట్ట పగలు చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల-సిద్ధిపేట ప్రధానరహదారి పక్కన ఇట్టిరెడ్డి రాజిరెడ్డి ఇంట్లో సోమవారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటితాళం పగల గొట్టి బీరువాలో ఉన్న 4తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్ఐ ఉపేంద్ర చారి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు.

రేషన్ దుకాణాల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

- ఇబ్బందులు పడుతున్న డీలర్లు, లబ్ధిదారులు


ఇబ్రహీంపట్నం మండలంలోని రేషన్‌దుకాణంలో పురుగులు పట్టిన దొడ్డు బియ్యం సంచులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని పలు రేషన్‌దుకాణాల్లో దొడ్డుబియ్యం ముక్కిపోతున్నాయి. ప్రభుత్వం గత ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పథకం ప్రారంభించిన నేపథ్యంలో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. అయితే మార్చి నెలలో అందజేసిన దొడ్డు బియ్యం కొన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులు తీసుకోకపోవడంతో మిగిలిపోయాయి. మండలంలోని 22రేషన్ దుకాణాల్లో సుమారుగా 80క్వింటాళ్ల దొడ్డు బియ్యం మిగిలిపోయాయి. అయితే మిగిలిపోయిన బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు వాపసు తీసు కోకపోవడంతో రేషన్‌దుకాణాల్లో ముక్కి పోతున్నాయి. బియ్యం సంచులకు పురు గులు పట్టి అవి కాస్త ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం సంచులకు సోకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల రేషన్ డీలర్లు కోరుతున్నారు.

● టెండర్లు పిలుస్తాం..
- వరప్రసాద్, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం



రేషన్ దుకాణాల్లో మిగిలిపోయిన బియ్యానికి ప్రభుత్వం టెండర్లు పిలుస్తుంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు సదరు బియ్యానికి మార్కెట్ ధర చెల్లించి తీసుకువెళ్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిరేషన్ దుకాణాల్లో మిగిలిపోయిన దొడ్డు బియ్యానికి ఈ వారంలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గూడ హరికృష్ణ డిసెంబరు 14, 2023లో ఇంటికి తాళంవేసి తనసొంత గ్రామం బొమ్మకల్‌కి వెళ్లాడు. డిసెంబరు 19, 2023న హరికృష్ణ పనిమనిషి ఇంటిని శుభ్రం చెద్దామని ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే యజమానికి విషయం తెలపగా, హరికృష్ణ ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో రూ.52వేలు దొంగలించారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. హుజూరాబాద్ కోర్టు కానిస్టేబుల్ మహ్మద్ యూసుఫ్ కోర్టులో సాక్షులను ప్రాసిక్యూషన్ తరుపున పీపీ రమాఉపేందర్ కేసును వాదించగా, జడ్జీ పద్మసాయిశ్రీ సోమవారం నిందితుడికి ఒక సంవత్సరం 8 నెలల శిక్ష విధించారు.

హుజూరాబాద్‌లో కొండచిలువ కలకలం


రోడ్డుపై నుంచి వెళ్తున్న కొండచిలువ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో సోమవారం రాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని లక్కీ వైన్స్‌వద్ద కొండచిలువ రహదారి మీదకు వచ్చింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కొండచిలువను పక్కనేఉన్న అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

కొండ చిలువను చంపిన కోతులు..

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో కోతులు అన్ని కలిసి ఓ కొండ చిలువను చంపేసి వాటి ఐక్యమత్యాన్ని చాటాయి. సోమవారం గ్రామానికి చెందిన చొప్పరి రవి ఇంటి పరిసరాల్లోకి కొండచిలువ వచ్చింది. సుమారు అది ఏడు అడుగుల పొడవు ఉంది. చెట్టుపై ఉన్న ఓ కోతిపిల్లను పట్టుకుని మెల్లమెల్లగా మింగింది. ఈ క్రమంలో చుట్టు పక్కల ఉన్న కోతుల గుంపు దానిని బెదిరిస్తున్నా కొండ చిలువ కోతిపిల్లను వదలకుండా పూర్తిగా మింగేసింది. దీంతో ఆవేశంలో ఉన్న కోతులన్నీ కలిసి ఆ కొండ చిలువను కొరికి చంపేశాయి.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


బూరారం(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బావుపేటలో రాజస్థాన్‌లోని నాగోల్ జిల్లా బర్నెల్‌కు చెందిన బూరారం(32) అనే కూలీ సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపల్లి సీఐ బిల్లకోటేశ్వర్ తెలిపారు. బూరారం సాయిశంకర్ గ్రానైట్స్ కటింగ్‌ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నాడని, కుటుంబ కలహాలతో అద్దెకు ఉంటున్న రేకులషెడ్డులో ఉరేసుకున్నాడని పేర్కొన్నారు. టేకేదార్ హీరాలాల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు


రాజన్న ఆలయంలోని ఫ్లైఓవర్‌ను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయఅబివృద్ధి, విస్తరణపనులు ఊపందుకున్నాయి. ప్రధాన ఆలయంలోని భక్తులు శ్రీస్వామి వారి దర్శనం కోసం వెళ్లేందుకు ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ క్యూలైన్‌లను సోమవారం తొలగించారు. ఉత్తరద్వారం వైపు నల్లాలసమీపంలో ప్రాకారం తొలగించడంతో ఎక్స్‌కవేటర్ ఆలయంలోకి ప్రవేశించింది. దీంతో క్యూలైన్‌లను మిషన్ సహాయంతో వేగంగా తొలగించారు.

సెల్ ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోనును కనుగొని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన బాధితుడు నిమ్మల నరేశ్‌కు సోమవారం అప్పగించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. నరేశ్ గ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోయిందని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బ్లూకోర్టు కానిస్టేబుల్ సాయివిహార్, హోంగార్డు శంకర్ సెల్‌ఫోను లోకేషన్‌ను పసిగట్టి బాధితుడు నరేశ్‌కు అప్పగించామని పేర్కొన్నారు. సెల్‌ఫోనును గుర్తించడంలో కృషిచేసిన కానిస్టేబుల్ సాయివిహార్, హోంగార్డు శంకర్‌లను ఎస్ఐ రాహుల్‌రెడ్డి అభినందించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలకు అధికారయంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కరీంనగర్ కేంద్ర శాఖ కలిగిన అర్బన్ బ్యాంక్‌కు జగిత్యాల, గంగాధరలో రెండు బ్రాంచ్‌లు ఉండగా, ఇటీవల గంగాధర బ్రాంచ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత ఎన్నికల్లో కరీంనగర్, జగిత్యాల సభ్యులకే ఓటు హక్కు లభించింది. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,282మంది ఓటర్లకు కరీంనగర్‌లో 7వేలు, జగిత్యాలలో 2వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 1న నిర్వహించే పాలకవర్గ ఎన్నికల్లో కరీంనగర్ ఓటర్ల కోసం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 24 పోలింగ్ కేంద్రాలు, జగిత్యాల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్ నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 1న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జరిగే పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ల కోసం క్యూలైన్లతోపాటు మంచినీటి వసతి, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారీబందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేములవాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హన్మాజిపేట గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై వెంకట్రాజం సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేల210 నగదుతోపాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం హెచ్చరించారు.

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోతున్న గంగాధర మండల రైతులు
- మార్కెట్ విలువ మేరకు పరిహారం అందించాలని నిర్వాసితుల డిమాండ్
- ఇప్పటికి ఆరు గ్రామ సభలు
- ఎటూ తేల్చని అధికారులు

పరిహారం అందేనా?



గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాల రైతులు నాలుగు ప్రాజెక్టులకు తమ జీవనాధారమైన భూములను ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందకపోవడంతో ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్తపల్లి, మనోహరబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి 2004లో ప్రతిపాదనలు పంపించారు. కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పరమల్యాల, గర్శకుర్తి, కాసారం గ్రామాల్లో భూమిని సేకరించారు. మూడేళ్ల క్రితమే ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన ఇతర


అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాయి

గ్రామాల రైతులకు పరిహారం అందించారు. గంగాధర మండలం రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గర్శకుర్తి, కాసారం గ్రామాల రైతులకు పరిహారం అందలేదు. భూమిలిచ్చి ఎనిమిదేళ్ల గడిచినా రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు పరిహారం అందించాలని వేడుకున్నా కనీస స్పందన కరువైంది. అధికారులు వచ్చి గ్రామంలో సభలు పెట్టి వెళ్లిపోతున్నారు. కాని పరిహారం విషయం తేల్చడం లేదు. నాలుగేళ్లుగా ఆరు గ్రామ సభలు నిర్వహించారు. ఇప్పటికీ పరిహారం అందించలేదు.

● నాలుగు ప్రాజెక్టులకు భూములు

మండలంలోని రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు తమ విలువైన భూములను నాలుగు ప్రాజెక్టులకు అప్పగించారు. వరద కాలువ, డి4 డిస్ట్రిబ్యూటరీ కెనాల్, 1.1 టీఎంసీ కాలువ, కొత్తపల్లి మనోహరబాద్ రైల్వే లైనుకు భూములిచ్చారు. నాలుగు గ్రామాల్లో 50.19 ఎకరాల వ్యవసాయ భూములు, రంగరావుపల్లిలో 23, కాసారంలో 5 ఇళ్లు రైల్వే లైనులో పోతున్నాయి. భూములు కోల్పోతున్న రైతులు తమకు పరిహారం వస్తుందని ఇతర ప్రాంతాల్లో భూములు కొనేందుకు అడ్వాన్స్ ఇచ్చారు. మరి కొందరు అప్పులు తెచ్చి వేరే ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో తమపై అప్పుల భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

జీవనాధారమైన భూమి పోతుంది

- ద్యావ లింగారెడ్డి, రైతు, రంగరావుపల్లి



కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైను నిర్మాణంలో ఐదు ఎకరాల భభూమి పోతుంది. ఆ భూమే నా కుటుంబానికి జీవనాధారం. రెండు కరెంటు బావుల్లో ఒకటి పోతుంది. ఉన్నదాంట్లో భూమి, బావి మధ్య నుంచి లైను పోతుంది. రైల్వే లైను వేస్తే పైపు లైన్ వెయ్యరాదు. ఉన్న బావి నీరు వారుకోవడానికి వీలు ఉండదు. ఈ బావికి కూడా పరిహారం అందిస్తే మరో బాయి తవ్వించుకుంటా. అధికారులు రైతులను బాధపెట్టవద్దు.

నాలుగు ప్రాజెక్టులకు భూమి ఇచ్చా

- సందవేని అయిలయ్య, రైతు, రంగరావుపల్లి



గ్రామంలో చేపట్టిన నాలుగు ప్రాజెక్టులకు నా భూమి ఇచ్చా. వరద కాలువ, డి4, 1.1 టీఎంసీ, రైల్వే లైనులో ఐదు ఎకరాల పైచిలుకు వ్యవసాయ భూమి, ఎనిమిది గుంటల ఇంటి స్థలం, ఇల్లు పోయింది. సర్కారు ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తున్నా. డబ్బులు ఇస్తే వేరే ప్రాంతంలో భూమి తీసుకుని ఇల్లు కట్టుకుందామనుకుంటున్న. పరిహారం ఎప్పుడిస్తరో చెప్పడం లేదు.

త్వరగా నష్టపరిహారం చెల్లించాలి

- ద్యావ మధుసూదన్‌రెడ్డి, రంగరావుపల్లి



గ్రామంలో రైల్వే లైనుతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. నా ఇల్లు కోల్పోతున్నాను. అధికారులు త్వరగా నష్టపరిహారం అందించాలి.

స్వదేశం చేరుకున్న గల్ఫ్ బాధితుడు


ఎయిర్‌పోర్టులో గౌరయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి రెండు నెలలుగా ఇబ్బందులు పడ్డ తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని గౌరయ్య సోమవారం స్వదేశానికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గౌరయ్యకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులను చూడగానే గౌరయ్య భావోద్వేగానికి గురయ్యాడు. తను రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయాన్ని ప్రస్తావిస్తూ తను స్వదేశానికి రావడానికి కృషి చేసిన కేటీఆర్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వాహనం ఏర్పాటు చేసి గౌరయ్యను బస్వాపూర్‌లో తన ఇంటికి చేర్చారు.

దుర్శేడ్ పాఠశాలలో చోరీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు ఆటవస్తువులు చోరీకి ఎత్తుకెళ్లారు. 5వ తరగతి గదిలో ఉన్న బీరువా పగలగొట్టి పిల్లలకు సంబంధించిన పుస్తకాలను చిందర వందర చేశారు. కొన్ని ఆటవస్తువులను దొంగిలించుకు పోయారు. పాఠశాల ప్రాంగణంలో నూనె పారబోశారు. పరిశీలించిన ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో రాణిస్తున్న సాహిత్య

● ఖేలో ఇండియా మహిళల విభాగంలో గోల్డ్‌మెడల్ ● జాతీయ స్థాయి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ

మంథనిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఉదరి సాహిత్య జిల్లా, రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో రాణిస్తోంది. ఇటీవల నిర్వహించిన ఖేలోఇండియా అండర్-14 సైక్లింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి పలు విభాగాలలో ఛాంపియన్‌గా నిలిచింది. వచ్చేనెలలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. గుంజపడుగుకు చెందిన ఉదరి శ్రీనివాస్, సంధ్య దంపతుల చిన్నకూతురు సాహిత్య 5వ తరగతి చదువుతోంది. శ్రీనివాస్ దంపతులు కొన్నేళ్ళుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రితో కలిసి ఉదయం గ్రౌండ్‌కు వాకింగ్ వెళ్లగా అక్కడ కొందరు చిన్నారులు సైక్లింగ్ శిక్షణ తీసుకుంటున్నారు. సైక్లింగ్‌పై సాహిత్య ఆసక్తి చూపడంతో శిక్షణ ప్రారంభమైంది. అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు హైదరాబాద్‌కు చెందిన కోచ్ డాక్టర్ మాక్స్వెల్ ట్రెవోర్ శిక్షణ ఇస్తున్నాడు. అతని శిక్షణలో సాహిత్య వివిధ విభాగలలో స్కూల్ గేమ్స్‌లలో మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించింది. సీఎం కప్‌లో సిల్వర్ మెడల్, రాజీవ్ స్పోర్ట్స్ అకాడమి నిర్వహించిన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. నవంబరు 1, 2వ తేదీలలో ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. సైక్లింగ్ శిక్షణకు ఒక్క సైకిల్ విలువ రెండు లక్షల వరకు ఉంటుందని, ప్రత్యేక గ్రౌండ్ అవసరం ఉంటుందన్నారు. సాహిత్యలో ఉన్న ప్రతిభను గుర్తించి కోచ్ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు.



సాహిత్య



సాహిత్య సాధించిన మెడల్స్

ఉత్సాహంగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అల్గునూరు వెలిచాల జగపతి రావు మెమోరియల్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఏ డివిజన్ వన్డేలీగ్‌కం నాకౌట్ క్రికెట్‌టోర్నీలో బడ్డింగ్ స్టార్స్ జట్టు కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుపై 16పరుగులు తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బడ్డింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 45ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 277పరుగులు చేసింది. ఈ జట్టు నుంచి జయరాం కశ్యప్ 121, అలంకృత్ అగర్వాల్ 52 పరుగులు తీశారు. కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టు నుంచి అఫ్రాజ్ గోరు 43 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కంబైన్డ్ డిస్ట్రిక్ట్‌జట్టు నిర్ణీతఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 261పరుగులు చేసి ఓటమి పాలైంది. జట్టునుంచి గణేష్ 74పరుగులు, డేవిడ్ కృపాల రాయి 43పరుగులు, జీఎస్‌కే రెడ్డి 50 పరుగులు సాధించారు. బడ్డింగ్ స్టార్స్‌జట్టు నుంచి ఉదయ్ కిరణ్ మూడు వికెట్లు తీసుకొని రాణించారు. ఈమ్యాచ్ నిర్వహణలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎంపైర్స్‌తోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, సభ్యులు మహేందర్‌గౌడ్, ఉపేందర్‌రావు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.


121 పరుగులు సాధించిన జయరాం కశ్యప్


క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న బడ్డింగ్ స్టార్స్, కంబైన్డ్ డిస్ట్రిక్ట్ క్రీడాకారులు

శంభో.. శంకరా..

- భీమన్న ఆలయానికి కార్తీక సోమవారం రద్దీ
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో రమాదేవి


భక్తులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్న భీమేశ్వర ఆలయ ఆవరణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రంలో భక్తులు హర హర మహాదేవా.. శంభో శంకర.. నామ స్మరణతో భీమన్న ఆలయం మారుమోగింది. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా పనులు జరుగుతుండటంతో భక్తులు భీమన్న ఆలయానికి సోమవారం పోటెత్తారు. కార్తీక సోమవారంను పురస్కరించుకుని ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణ, ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. నటరాజు విగ్రహం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైల వద్ద భక్తులు బారులు తీరారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు భీమేశ్వర పాహిమాం అంటూ మొక్కులు చెల్లించుకుని వేడుకున్నారు. శ్రీస్వామి వారికి ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు అభిషేకాలు, గండ దీపంలో నూనె పోస్తూ గండాలు తొలగి పోవాలని వేడుకున్నారు. నూతనంగా నిర్మించిన షెడ్లలో చండీహోమం, సత్యనారాణ వ్రతాలు, లింగార్చనలు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కాగా అన్నదాన సత్రంపై అంతస్తులో ఏర్పాటుచేసిన నిత్యకళ్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అంతే కాకుండా కార్తీక సోమవారం సందర్భంగా శ్రీస్వామి వారితో పాటుగా అనబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చనలు ఆలయ అర్చకులు వైదికంగా చేపట్టారు.

భీమన్న ఆలయంలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో..

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా రాజన్న, భీమన్న ఆలయాలకు భక్తుల పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజన్న ఆలయ ఈవో రమాదేవి ఆలయంలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని ఉద్యోగులను ఈవో ఆదేశించారు.

భీమేశ్వర ఆలయంలో భక్తుల మొక్కులు..

వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భీమన్న ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు 4వేల 21మంది కోడెమొక్కులు, 48అభిషేక పూజలు, 11అన్నపూజలు, 89 నిత్య కళ్యాణ పూజలు, 2చండీహోమం, 11 సత్యనారాయణ వ్రతాలు, 6కుంకుమపూజలు ఒక్కటి లింగార్చన, మూడు వాహనపూజలు, 21 పెద్దసేవల, పల్లకిసేవల టికెట్‌లు భక్తులు తీసుకున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం గోదావరిమాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీసోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు.


కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

అంజన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిదిలో సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకులు రఘు, ఆలయ సిబ్బంది అశోక్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.


కొండగట్టులో దీపాలు వెలిగించిన భక్తులు

క్రికెట్ పోటీల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ పోటీల్లో సుల్తానాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జెఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్14,17 బాలబాలికల విభాగంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 17ఏళ్ల విభాగంలో వైష్ణవి, సాత్విక, అండర్ 14లో దిశాంత్‌లు ప్రతిభ చూపి, ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం దివాకర్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్, ఉపాధ్యాయలు, తల్లితండ్రులు సోమవారం అభినందించారు.


క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి

- భక్తుల రద్దీ
- ప్రత్యేక పూజలు

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వస్వామి, శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం నిర్వహించగా భక్తులు బిల్వార్చన చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది సేవలు అందించారు.


ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు


రామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం

● గోదావరి హారతి..

కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురివద్ద సోమవారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ విశేష పూజలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు.

● రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ క్రైం: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బొమ్మకల్ లారీ అసోసియేషన్ వద్ద సోమవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు చామనపల్లి బాబు, సిద్ధ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ఇటీవల అక్రమంగా తరలిస్తున్న 11ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. ట్రిప్పు 1800 డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

గంగాధర: మండలంలోని ముప్పిడి నర్సయ్యపల్లెలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామ నాయకుడు దుబ్బాసి బాలు ఆధ్వర్యంలో కరీంనగర్ సన్‌రైజ్ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. పబ్బతి వెంకట్‌రెడ్డి, చిన్నలచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి రాజు తదితరులుపాల్గొన్నారు.

సుభాష్‌నగర్: దారం సుశీల ట్రస్టు తరఫున డాక్టర్ రఘురామన్ వృద్ధులకు స్టీల్ చేతి కర్రలను పంపిణీ చేశారు. సోమవారం బోయవాడకు చెందిన ఒకరికి, సీతారాంపూర్‌కు చెందిన ఇద్దరితోపాటు నగరంలోని స్పందన వృద్ధాశ్రమంలోని ముగ్గురికి అందజేశారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దెలోని రైతు వెంకటరామిరెడ్డి పొలంలో నానో యూరియాపై సోమవారం క్షేత్రప్రదర్శన నిర్వహించారు. కృషి విజ్ఞానకేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, ఏడీఏ సునీత, ఇఫ్కో సంస్థ రాష్ట్ర మేనేజర్ కృపాశంకర్, సేల్స్ మేనేజర్ బాలాజీ, ఏఈవో అనూష ఉన్నారు.

మానకొండూర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ నవంబరు 1న హైదరాబాద్‌లో జరిగే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో సోమవారం బేడ, బుడగ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పలువురు కొనియాడారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కరీంనగర్‌లోని సీఎస్ఐ వెస్లీ క్యాథడ్రల్ చర్చిలో పీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరయ్యారు. ముందుగా పాస్టరేట్ సెక్రెటరీ జీవీ సంజయ్ స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ పాల్ కొమ్ములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణ త్యాగాల ఫలితంతోనే ఈ రోజు దేశం ప్రశాంతంగా ఉందన్నారు.


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సీపీ గౌస్ ఆలం

అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు రామచందర్‌రావు, సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, శ్రీలత, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, పీస్ కమిటీ సభ్యుడు తిమోతి జయరాజ్, గఫార్, జనార్దన్‌రెడ్డి, నికోలస్, సత్యానందం, సురేష్ చందర్‌రావు, పాస్టర్లు దయాకర్, గిద్యోను, సాలమోన్ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

పోలీసుశాఖలో పనిచేస్తూ మరణించిన నాలుగు కుటుంబాలకు చెందిన నలుగురు అభ్యర్థులకు సోమవారం సీపీ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా నియామక పత్రాలు అందుకున్న వారిలో వి.అఖిల, ఎం.అరుణ్ కుమార్, ఎం.రిషికుమార్, మహమ్మద్ సకీబ్ ఉద్దీన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిషనల్ డీసీపీ శ్రీవెంకటరమణ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లు ప్రారంభమెప్పుడో?

చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుకు మద్దతు కరువయింది. ఓవైపు వ్యాపారులు తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తుండగా మద్దతు ధర చెల్లించాల్సిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదు. ఫలితంగా పత్తి నిల్వలు రైతుల ఇండ్లలో పేరుకుపోతున్నాయి. దసరా తర్వాత పత్తి ఏరడం ప్రారంభించిన రైతులు అమ్మకం కోసం జిన్నింగ్ మిల్లులవైపు వెళ్లగా క్వింటాలుకు పత్తికి రూ.5500నుంచి 6వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ పత్తికి మద్దతు ధర 8,110 రూపాయలు ఉండగా ప్రైవేట్‌లో అమ్ముకున్న రైతులు భారీగా నష్టపోతున్నారు. సీసీఐ కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వలు(ఫైల్)

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను వేధింపులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ గంగాధరలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కరీంనగర్, జగిత్యాల ప్రధానరహదారి మధురానగర్‌లో బీజేపీ నాయకులతోపాటు మండల నాయకులు పెద్దఎత్తున ధర్నా చేశారు. దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకుల ధర్నాకు మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మద్దతు తెలిపారు.

బండి సంజయ్‌ని కలిసిన గన్నేరువరం వాసులు

గన్నేరువరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రంనుంచి నిధులు మంజూరు చేయించినందుకు కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సోమవారం గన్నేరువరం గ్రామస్థులు కరీంనగర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మండల ప్రజలకు అనువుగా ఉండేచోటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయనను కోరినట్లు తెలిపారు. గ్రామస్థులు జువ్వాడి మన్మోహన్‌రావు, పుల్లెల పవన్‌కుమార్, రాము, బొడ్డు బాలయ్య, రంగనవేని శ్రీనివాస్, తిప్పర్తి ప్రవీణ్, కుంభం మహేష్, బోయిని లచ్చయ్య, తిరుపతి పాల్గొన్నారు.

‘శ్రీచైతన్య’ ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్

తిమ్మాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ సహకారంతో కాంక్రీటింగ్ కాంక్రీట్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌ను విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం విద్యాసంస్థ-పరిశ్రమల మధ్య పరస్పర సంబంధాలను బలోపేతం చేయడం విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, ఆధునిక జ్ఞానాన్ని పెంపొందించడం వంటివాటికి ఉపయోగ పడుతుం దన్నారు. కార్యక్రమానికి అల్ట్రాటెక్ సిమెంట్ తెలంగాణ రీజినల్ టెక్నికల్ హెడ్ నందికా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. తరువాత నిర్వహించిన పోటీల్లో విజేతలకు రమేష్‌రెడ్డి బహుతులను అందజేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతి శ్రీరామ్, అల్ట్రాటెక్ సిమెంట్‌సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

ఆలయాల్లో కార్తీక శోభ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. నగరంలోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. మహిళలు తులసి కోటల వద్ద పూజలు చేశారు. పలువురు భక్తులు ధర్మపురి, కాళేశ్వరం, మంథని, కోటిలింగాల, రాయపట్నం వద్ద నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లారు. కార్తీక దీపాలను వదిలి మొక్కులు చెల్లించుకున్నారు.


పాతబజార్ గౌరీశంకరాలయంలో భక్తులు

శ్రీవారి సేవలో సుడా చైర్మన్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని సోమవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్‌రెడ్డి దంపతులు, హుజూరాబాద్ కాంగ్రెస్ నాయకుడు దొంత రమేష్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు.


తిరుమలలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మానకొండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి, మానకొండూర్, గంగిపల్లి, అన్నారం గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీవైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి, కాట్నపల్లి, తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, ఆత్మచైర్మన్ గుర్రం రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, పాల్గొన్నారు.


మానకొండూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఓదెలు

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి, మల్లివానిపల్లె గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తహసీల్దార్ రాజమల్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం స్వామి, ఆర్ఐ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

జమ్మికుంట: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సొసైటీచైర్మన్ పొనగంటి సంపత్ అన్నారు. సోమవారం జమ్మికుంట పాతవ్యవసాయ మార్కెట్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందంతో కలిసి సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ ప్రారంభించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిగురుమామిడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హుస్నాబాద్ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ జంగా వెంకట రమణారెడ్డి, తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఎస్ఐ సాయికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్ మార్కెట్‌కు మక్కలు తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా మంత్రి మండల కేంద్రంలో మొక్కజొన్న కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. రైతులందరూ ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లేశం, ఏఈవో ఎండి ఫరీద్, నాయకులు రవీందర్, పాల్గొన్నారు.

ఎస్టీయూ నిరసన

వీణవంక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై కానిస్టేబుల్ దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోనే సత్యం, ఉపాధ్యాయురాలు రజిత అంగన్వాడీ టీచర్ స్వరూప పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలి

ఇల్లందకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు రూ.6.28లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో సమస్యలపై ఎక్కడ రాజీపడవద్దని, సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్, రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న వొడితెల ప్రణవ్

నిబంధనలు పాటించాలి

తిమ్మాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రయివేటు హాస్టల్స్ నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలని తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ అన్నారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఎస్సై శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి ఆయన ప్రైవేటు హాస్టల్స్ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్లో ఉండే విద్యార్థులు ఎవరైనా గంజాయిని సేవిస్తున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతీ హాస్టల్‌లో రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు.

కరీంపేటలో బోర్ ప్రారంభం

శంకరపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరీంపేట గ్రామంలో ఎంపీ నిధుల నుంచి వేసిన బోర్‌ను పంచాయతీ కార్యదర్శి సుమన్ సోమవారం ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ నరేందర్, శ్రీనివాస్, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి


నిరసన తెలపుతున్న రైతులు

చిగురుమామిడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో గడ్డ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా సర్వే అధికారులు వచ్చి సర్వేచేసి కొనుగోలు కేంద్రానికి అనుకూలంగా స్థలం ఉందని చెప్పినప్పటికీ రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్‌ను అమలు చేయకపోతే గ్రామ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మహిళాసంఘాలు, రైతులు, ట్రాక్టర్స్ ఓనర్స్ పలు సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో విద్యార్థులకు ఓపెన్ హౌస్


ఓపెన్‌హౌస్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సైబర్ క్రైం బృందం, ఎస్సై నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

● కరీంనగర్ త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

హుజూరాబాద్/ఇల్లందకుంట : హుజూరాబాద్, ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. హుజూరాబాద్‌లో ఏసీపీ మాధవి, జమ్మికుంటలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ క్రాంతికుమార్ విద్యార్థులకు రిసెప్షన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, లాకప్, కోర్టు రూమ్, కంప్యూటర్ రూమ్, క్రైమ్ ఫైల్స్, సాంకేతిక పరిజ్ఞానం, ఎదురయ్యే సవాళ్లు, పోలీసుల విధులు, అధికారులు తదితర అంశాలపై వివరించారు. అలాగే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. చదువు ఒక్కటే విద్యార్థుల జీవితాలను మారుస్తుందని, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కరుణాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న ఏసీపీ మాధవి

మద్యం దుకాణాలకు లైసెన్స్ దారుల ఖరారు

(5వ పేజీ తరువాయి)

వైన్‌షాపుల్లో 23 మంది మహిళలు లైసెన్స్‌లను దక్కించుకోవడం గమనార్హం. మిగతా 71 మంది పురుషులు వైన్‌షాపుల లైసెన్సీలుగా ఎంపిక య్యారు. మద్యం షాపుల లాటరీ ప్రక్రియకు 2,730 మంది దరఖాస్తుదారులతోపాటు వారి అనుచరులు, స్నేహితులు, వ్యాపారులు కలిసి మూడు వేలపైగా మంది భారీ సంఖ్యలో కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియం వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఆడిటోరియం వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎంట్రీపాస్ ఉన్నవారినే లోపలికి అనుమతించారు. లాటరీ ప్రక్రియము గియగానే ఆయా దరఖాస్తుదారులను బయ టకు పంపించారు.

● ప్రభుత్వానికి భారీగా ఆదాయం

జిల్లాలో ప్రస్తుతం 94 వైన్‌షాపుల లైసెన్స్‌లు ఖరారు కాగా ఎక్సైజ్ శాఖకు ఏడాదికి 55.45 కోట్ల రూపాయల ఆదాయం సమకూరనున్నది. 11 వైన్స్‌కు 50 లక్షల వంతున 5.5 కోట్లు, మరో 40 షాపులకు 55 లక్షల వంతున 22 కోట్లు, 43 షాపులకు 65 లక్షల వంతున 27.95 కోట్ల రూపాయలు లైసెన్స్ ఫీజు కింద ఆదాయం సమకూరనున్నది. ఈ ఫీజులో ఆరు వంతు డబ్బులు లైసెన్స్‌దారులు మంగళవారంలోగా చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రూపంలో ఏడాదికి మొత్తం 55.45 కోట్ల రూపాయలు సమకూరనుండగా, 2,730దరఖాస్తుల ద్వారా 81.9 కోట్ల రూపాయలు ఇప్పటికే ఆదాయం సమకూరింది. ఈ 94 వైన్‌షాపులు 5 లక్షల వంతున 4.7కోట్ల రూపాయలు స్పెషల్ ఎక్సైజ్ టాక్స్ చెల్లించాలి. మొత్తం కలిపి మొదటి ఏడాదిలో 142.05 కోట్ల ఆదాయం సమకూరనుంది.

విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ మాతాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో చాతర్ల హర్షిత్‌కుమార్, కాల్వ అభిషేక్ ద్వితీయస్థానం సాధించారు. విజేతలకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు దీక్షితుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంఎస్ ధోనిని కలిసిన గట్టు అనిల్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని కరీంనగర్‌కు చెందిన అంతర్జాతీయ రోల్ బాల్ క్రీడాకారుడు గట్టు అనిల్ కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఢిల్లీలోని దుర్గం కార్యాలయంలో పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గొప్ప క్రికెటర్‌ను కలవడం ఆనందంగా ఉందని, ధోని స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు క్రీడల్లో రాణించాలని అన్నారు.


ధోనితో అనిల్

నేడు మాజీ మంత్రి కేటీఆర్ రాక

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో మాజీమంత్రి కేటీఆర్ మంగళవారం పర్యటించనున్నారు. ఇటీవల రంగాపూర్ గ్రామానికి చెందిన వర్షిత వంగర గురుకుల హాస్టల్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.

పని చేసేవారికి ఓటు వేయండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు అభివృద్ధి కోసం పనిచేసే వారికి ఓటు వేయాలని అర్బన్ బ్యాంకు తాజా మాజీ చైర్మన్, ప్యానల్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి బ్యాంకు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబరు 1న జరిగే పాలకవర్గ ఎన్నికల్లో తమ ప్యానల్‌కు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ప్యానల్‌లోని డైరెక్టర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనను చంపుతామని 47వ డివిజన్‌కు చెందిన కొందరు బెదిరిస్తున్నట్లు, ఈ విషయమై సోమవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే డివిజన్‌లోని షాషాబ్ స్ట్రీట్‌కు చెందిన ఎండీ ఖాలీద్ తెలిపాడు. తమ వీధిలో ఇష్టంవచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నారని, చెట్లుపెంచుతూ దోమలు అధికంగా అవటానికి కారణమవుతున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది ఈ నెల 22న ఆక్రమణలు, చెట్లను తొలగించారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అదేరోజు రాత్రి నలుగురు తన ఇంటిపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపటి నుంచి సీతారామాలయ బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి దేవాలయ 28వ వార్షిక బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, వికాసతరంగిణి వావిలాలపల్లి శాఖ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 29న ప్రారంభమై 2వ తేదీన ముగుస్తాయని ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ మేచినేని వనజ-అశోక్‌రావు పేర్కొన్నారు.

అంబాల ప్రభాకర్‌కు డాక్టరేట్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి మడిపల్లికి చెందిన అంబాల ప్రభాకర్ అందుకున్నారు. సామాజిక సేవారంగంలో కృషికి సోమవారం తమిళనాడులోని హోసూర్‌లో ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి ప్రముఖుల చేతుల డాక్టరేట్‌ను అందుకున్నారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో సోమవారం కేంద్రాన్నిపరిశీలించారు. పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

శంకరపట్నం : మండలంలోని లింగాపూర్‌లో మండల పశువైద్యాధికారి డాక్టర్ మాధవరావు ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

జమ్మికుంట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు కొమ్ము నరేష్ అన్నారు. సోమవారం హలో విద్యార్థి చలో కలెక్టరేట్‌లో భాగంగా మండలంలోని పలు విద్యాసంస్థలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కరపత్రాలు ఆవిష్కరించారు.

నేడు మహిళా ఆరోగ్య బేస్ క్యాంపు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్న జీయరు స్వామి ఆశీస్సులతో వికాసతరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో ముఖరంపురలోని ఆండాళ్‌భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉచిత మహిళా ఆరోగ్య బేస్ క్యాంపు ప్రారంభించనున్నట్లు గౌతమరావు ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల 2వ, 4వ ఆదివారాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత క్యాంపు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

జమ్మికుంట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ పత్తి రైతుల రాష్ట్ర కో-కన్వీనర్ చెల్పూరి రాములు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ ధరకు పత్తి విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించాలి

తిమ్మాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాప్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను వెంటనే ఆవిష్కరించాలని రాజకీయ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సంఘం భవనంలో, బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో వేర్వేరుగా దళిత సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. రాజకీయలకతీతంగా ఏకంకావాలని పిలుపునిచ్చారు. నాయకులు సంపత్, శంకర్, అంజయ్య, జగదీశ్వరచారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.